పేదలకూ ఉన్నత చదువే సీఎం ధ్యేయం

- ఏలూరు ఎమ్మెల్యే ఆళ్ల కాళీకృష్ణ శ్రీనివాస్ (నాని)
- 41వ డివిజన్‌లో ఉత్సాహంగా గడపగడపకు మన ప్రభుత్వం

ఏలూరు టౌన్: విద్యతోనే సమాజంలో అంతరాలు తొలగి ఆయా కుటుంబాలు ఆర్థిక పరిపుష్టి సాధిస్తాయని నమ్మిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి విద్యారంగంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టారని ఏలూరు ఎమ్మెల్యే ఆళ్ల కాళీకృష్ణ శ్రీనివాస్ (నాని) అన్నారు. ఏలూరు నగరంలో 69వ రోజు గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆదివారం 41వ డివిజన్ 16, 17 సచివాలయాల పరిధిలో నిర్వహించారు. ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. 41వ డివిజన్ కార్పొరేటర్ ఈదుపల్లి కల్యాణి, వైఎస్సార్ సీపీ నాయకులు ఈదుపల్లి పవన్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే ఆళ్ల నానికి డివిజన్ ప్రజలు, నాయకులు అపూర్వ స్వాగతం పలికారు. ప్రతి ఇంటిలోనూ సంక్షేమ పథకాలు ఏ విధంగా అందుతున్నాయో అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేద పిల్లలు సైతం అత్యుత్తమ ప్రమాణాలతో కూడిన విద్యను అభ్యసించాలనే తపనతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నూతన విధానాలను అమల్లోకి తెచ్చారని తెలిపారు. పిల్లల భవిష్యత్తును తీర్చిదిద్దేందుకు అమ్మ ఒడి, జగనన్న విద్యాకానుక, వసతి దీవెన, విదేశీ విద్యాకానుక వంటి పథకాలు అమలు చేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ స్కూళ్లను కార్పొరేట్ స్థాయిలో నాడు-నేడు కింద అభివృద్ధి చేయటంతో పాటు 8వ తరగతి నుంచి అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలు కలిగిన బైజూస్ కంపెనీతో ఒప్పందం చేసుకుని ట్యాబ్‌లను సైతం పంపిణీ చేశారని గుర్తు చేశారు. విద్యతోనే పిల్లలు భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరతారనే విశ్వాసంతో ఆయన వినూత్న పథకాలను ప్రవేశపెట్టారని తెలిపారు. ఈ గడపగడపకూ కార్యక్రమంలో నగర మేయర్ షేక్ నూర్జహాన్, ఏలూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఛైర్‌పర్సన్ మధ్యాహ్నపు ఈశ్వరి, డిప్యూటీ మేయర్ నూకపెయ్యి సుధీర్‌బాబు, ఏఎంసీ ఛైర్మన్ నెరుసు చిరంజీవి, వైస్ ఛైర్మన్ కంచన రామకృష్ణ, ఏఎంసీ మాజీ ఛైర్మన్ మంచెం మైబాబు, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు మధ్యాహ్నపు బలరాం, నగర అధ్యక్షులు బొద్దాని శ్రీనివాస్, కార్పొరేటర్లు నున్న స్వాతిశ్రీదేవి, జిజ్జువరపు విజయనిర్మల, జనపరెడ్డి రాజేశ్వరి, అర్జి సత్యావతి, పాలిమేర దాసు, లీగల్‌సెల్ ప్రత్తిపాటి తంబి, చేనేత సొసైటీ ఛైర్మన్ కొల్లిపాక సురేష్, ఏలూరు కేబుల్ ఆపరేటర్స్ అసోసియేషన్ సెక్రటరీ సంపంగి జగదీష్, పార్టీ నాయకులు మోటమర్రి సదానందం, జిజ్జువరపు రమేష్, నున్న కిషోర్ ఉన్నారు.



ఏలూరులో 41వ డివిజన్‌లో మహిళలను ఆప్యాయంగా పలుకరిస్తున్న ఎమ్మెల్యే ఆళ్ల నాని, చిత్రంలో మేయర్ నూర్జహాన్, ఇడా ఛైర్‌పర్సన్ ఈశ్వరి

క్లుప్తంగా

వినోదంతో ఆహ్లాదం



సీఎస్ఆర్ మాల్ వైఎస్‌టీడీ సెంటర్‌ను ప్రారంభిస్తున్న సినీనటి పాయల్ రాజ్‌పుత్, ఎమ్మెల్యే ఎలీజా

జంగారెడ్డిగూడెం : పట్టణంలో సీఎస్ఆర్ మాల్ వైఎస్‌టీడీ సెంటర్‌ను ప్రముఖ సినీ నటి పాయల్ రాజ్‌పుత్, ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే ఎలీజా మాట్లాడుతూ జంగారెడ్డిగూడెం దినదినాభివృద్ధి చెందుతోందని, అందుకు అనుగుణంగా మెరుగైన వసతులు సమకూరడం పట్టణానికి మరింత శోభ చేకూరుతుందన్నారు. సినీనటి పాయల్ రాజ్‌పుత్ మాట్లాడుతూ కోవిడ్ అనంతరం వినోదంలో ఓటీటీ భాగం కావడంతో థియేటర్స్‌కు వచ్చే వారికి సంఖ్య తగ్గుతోందన్నారు. ఇటువంటి సమయంలో ఒక పక్క వినోదాన్ని అందిస్తూ, మరో పక్క ఆహ్లాదాన్ని పంచేలా సీఎస్ఆర్ మాల్ వైఎస్‌టీడీ సెంటర్ నిర్మించడం శుభ పరిణామం అన్నారు. ఇక్కడి ప్రజల ఆదారాభిమానులు చూస్తుంటే చాలా సంతోషంగా ఉందన్నారు. మాల్ నిర్వాహకులు యార్లగడ్డ వెంకట రత్నకుమార్, చెరుకూరి నరేన్ మాట్లాడుతూ మల్టీప్లెక్స్‌లో ఈ నెల 12 నుంచి చిత్ర ప్రదర్శన ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి, జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి, బంగారు సూర్యనారాయణ పాల్గొన్నారు.

దుస్తుల పంపిణీ



దుస్తులు అందించిన దృశ్యం

ఏలూరు రూరల్: చాటపర్రు రోడ్డు వెంకటాపురం అంధుల సంక్షేమ సంఘంలో ఆదివారం సంక్రాంతిని పురస్కరించుకుని 30 మంది అంధ మహిళలకు దుస్తులు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో దాత జల్లపల్లి బాబురావు, బీకేఎస్ఆర్ అయ్యంగార్, కె గణేష్, దుర్గారావు, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కార్యవర్గ ఎన్నిక

ఏలూరు (టూటౌన్): అమీనాపేట ఏటిగట్టు ప్రాంతంలోని జిల్లా యాదవ సంఘం కార్యాలయంలో యాదవ ఎడ్యుకేషనల్ సొసైటీకి నూతనంగా ఎన్నికైన అధ్యక్ష, కార్యవర్గసభ్యులతో అఖిల భారత యాదవ సంఘం జిల్లా అధ్యక్షులు చిదరబోయిన శ్రీనివాసరావు ఆదివారం ప్రమాణ స్వీకారం చేయించారు. సొసైటీ నూతన అధ్యక్షుడు గోళ్ల దుర్గాప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న పథకాలు, వనరులను సద్వినియోగం చేసుకునేలా యాదవులను ప్రోత్సహిస్తామన్నారు. ఉక్కుసూరి గోపాలకృష్ణ, కిలారపు బుజ్జి, మల్లిపూడి రాజు, నాయకులు పాల్గొన్నారు.

కోడిపందేలు, జూదం చట్టరీత్యా నేరం



మాట్లాడుతున్న తహసీల్దార్ సోమశేఖర్

ఏలూరు రూరల్: ఏలూరు కార్పొరేషన్, మండలంలోని గ్రామాల్లో కోడిపందేలు, జూదం నిర్వహించే వారిపై కఠిన చర్యలు చేపడతామని తహసీల్దార్ బి.సోమశేఖర్ హెచ్చరించారు. ఆదివారం చొదిమెళ్లలో నిర్వహించిన అవగాహన సదస్సులో తహసీల్దార్ మాట్లాడుతూ కోడి పందేలు, జూదం నిర్వహించడం చట్టరీత్యా నేరం అన్నారు. పందేల నిర్వాహకులు, బరి కోసం స్థలాలు ఇచ్చే యజమానులకు సైతం నోటీసులు జారీ చేస్తున్నామన్నారు. జూదం ఆడడం వల్ల ఆర్థికంగా నష్టపోయి కుటుంబాలు రోడ్డున పడతాయన్నారు. అంతేకాక పోలీసు కేసులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. సదస్సులో స్థానిక కార్పొరేటర్ బత్తిన విజయ్‌కుమార్, వీఆర్వో తాడి వరప్రసాద్, కానిస్టేబుల్ సత్యరావు, సచివాలయం మహిళ పోలీసు సరేళ్ల అమ్ములు పాల్గొన్నారు.

ఆహ్లాదకరంగా హేలాపురి సంక్రాంతి వేడుకలు

భోగి మంటలు వెలిగించిన ఎమ్మెల్యే ఆళ్ల నాని

ఏలూరు టౌన్: నగరానికి సంక్రాంతి శోభ ముందుగానే వచ్చింది. భోగి మంటలు.. బసవన్నల నృత్యాలు, మహిళల రంగవల్లుల పోటీలు.. యువతకు వాలీబాల్ పోటీలు, చిన్నారుల కేరింతలతో సంక్రాంతి వేడుకలు ఉత్సాహంగా సాగాయి. ఏలూరు చాటపర్రు రోడ్డు వినాయక్‌నగర్‌లోని వంకినేని జానకమ్మ పొలాల్లో ఆదివారం హేలాపురి సంక్రాంతి శోభ -2023 వేడుకలు ఆహ్లాదకర వాతావరణంలో సాగాయి. ఏలూరు ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ ఏలూరు జిల్లా అధ్యక్షులు ఆళ్ల నాని ముఖ్యఅతిథిగా హాజరై భోగి మంటలను వెలిగించి సంక్రాంతి సంబరాలను లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాని మాట్లాడుతూ సంప్రదాయ వేడుకలకు చిరునామాగా సంక్రాంతి వేడుకలు నిలుస్తాయని, ప్రతి ఒక్కరూ ఎంతో సంతోషంగా పండుగను జరుపుకోవాలని కోరారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలనతో ప్రజల జీవితాల్లో ఆనందాలు వెల్లువిరుస్తోందన్నారు. ముఖ్యంగా రైతుల సంక్షేమానికి పెద్దపీట వేస్తూ అనేక పథకాలు అమలు చేస్తున్నారన్నారు. యువత సంక్రాంతి పండుగ పేరుతో జూదాలవైపు మళ్లకుండా సంప్రదాయ క్రీడలతో సంతోషంగా వేడుకలు చేసుకోవాలని కోరారు. సంక్రాంతి వేడుకలను ప్రత్యేకంగా ఏర్పాటు చేయటంపై నిర్వాహకులు అబ్బూరి అనిల్‌ను అభినందించారు. నగర డిప్యూటీ మేయర్ సుధీర్‌బాబు, ఏఎంసీ ఛైర్మన్ చిరంజీవి, కార్పొరేటర్లు జయకర్, సుంకర చంద్రశేఖర్, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షులు బొద్దాని శ్రీనివాస్, నాయకులు నున్న కిషోర్, నిడికొండ నరేంద్ర ఉన్నారు.



సంక్రాంతి శోభ కార్యక్రమంలో భోగి మంటలు వెలిగిస్తున్న ఎమ్మెల్యే ఆళ్ల నాని

కృష్ణయ్యకు బీసీ నాయకుల సత్కారం

ఏలూరు (టూటౌన్): జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఏపీ అధ్యక్షులు లాకా వెంగళరావు, కన్వీనర్ ఎనగల నూకాలమ్మ ఆధ్వర్యంలో ఆదివారం విజయవాడలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి, జిల్లా, నియోజకవర్గ నాయకుల శిక్షణ తరగతులకు ఏలూరు నుంచి పలువురు నాయకులు పాల్గొన్నట్లు ఏలూరు అర్బన్ అధ్యక్షులు లక్కోజు రాజగోపాలాచారి చెప్పారు. ఈ కార్యక్రమానికి జాతీయ అధ్యక్షులు ఆర్.కృష్ణయ్య హాజరై దిశానిర్దేశం చేశారన్నారు. బీసీలు అన్ని రంగాల్లోనూ రాజకీయంగా ఎదగాలని, బీసీలకు ఎక్కడ అన్యాయం జరిగినా నాయకులందరూ కలిసి ఆ సమస్యలను పరిష్కరించాలని కృష్ణయ్య తెలియజేశారన్నారు. రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లోనూ పూర్తిస్థాయిలో కమిటీలను ఏర్పాటు చేయాలని కోరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఏలూరు అర్బన్ జిల్లా జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు లక్కోజు రాజగోపాలాచారి మాట్లాడుతూ రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం బీసీలకు అనేకమైన రాజకీయ అవకాశాలు కల్పించిందన్నారు. జాతీయ అధ్యక్షులు చెప్పినట్లుగా నియోజకవర్గ స్థాయిలో సంఘాన్ని బలోపేతానికి కృషి చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏలూరుకు చెందిన బీసీ నాయకులు అబ్బిరెడ్డి రంగ ముత్యాలు, ఈదలాడ నాని, కె.దుర్గేష్ పాల్గొన్నారు.



విజయవాడలో శిక్షణ తరగతులకు హాజరైన కృష్ణయ్యను సత్కరిస్తున్న ఏలూరు నాయకులు

మిర్చి రైతులను ఆదుకోవాలి

ఏలూరు (టూటౌన్): తామర, నల్లి పురుగు, వైరస్ తెగుళ్లతో నష్టపోయిన మిర్చి రైతులను ఎకరాకు రూ.లక్ష నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ కోరారు. స్థానిక పవరుపేటలోని అన్నే భవన్‌లో తామర, నల్లి పురుగు వైరస్ తెగుళ్ళు-మిర్చి రైతులకు నష్టాలపై ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఏలూరు జిల్లాలోని ముసునూరు, ఆగిరిపల్లి, లింగపాలెం, కుక్కునూరు, వేలేరుపాడు తదితర మండలాలలో తెగుళ్లతో మిర్చి పంటకు తీవ్ర నష్టం జరుగుతోందన్నారు. ఎకరాకు ఐదు క్వింటాళ్ల లోపే దిగుబడి వస్తుందన్నారు. పంట నష్టాలను నమోదు చేసి రైతులకు నష్టపరిహారం ఇవ్వాలని శ్రీనివాస్ ప్రభుత్వాన్ని కోరారు.

అండగా ఉంటాం.. అధైర్యపడొద్దు

పలు కుటుంబాలకు ఎమ్మెల్యే ఆళ్ల నాని పరామర్శ

ఏలూరు టౌన్: ఏలూరు నియోజకవర్గంలోని పలువురిని ఆదివారం ఎమ్మెల్యే ఆళ్ల నాని పరామర్శించారు. ఏలూరు బీడీ కాలనీకి చెందిన యర్రా రాము ఇటీవల మృతి చెందారు. ఆయన కుటుంబాన్ని ఎమ్మెల్యే నాని పరామర్శించారు. అందరికీ ధైర్యాన్ని చెబుతూ మీకు తమ సహాయ సహకారాలు ఎల్లవేళలా ఉంటాయని తెలిపారు. వినాయక్ నగర్‌కు చెందిన పల్లా రాంబాబు తండ్రి పల్లా సత్యనారాయణ ఇటీవల మృతి చెందారు. ఆయన కుటుంబాన్ని ఎమ్మెల్యే నాని పరామర్శించారు. కుటుంబ సభ్యులకు మనోధైర్యాన్ని ఇవ్వాలని భగవంతుని కోరారు. అలాగే కండ్రికగూడెంలో అనారోగ్యంతో ఇబ్బందిపడుతున్న మాజీ సర్పంచ్ లచ్చిరెడ్డి గోవిందరావును పరామర్శించారు. ఆరోగ్య స్థితిని అడిగి తెలుసుకున్నారు. కుటుంబాలకు వైఎస్సార్‌సీపీ ఎప్పుడూ తోడుగా ఉంటుందన్నారు. ఎమ్మెల్యే నాని వెంట వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షులు బొద్దాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ నూకపెయ్యి సుధీర్‌బాబు, ఏఎంసీ ఛైర్మన్ నెరుసు చిరంజీవి, నున్న కిషోర్, పారిపిరెడ్డి నాగేశ్వరరావు తదితరులు ఉన్నారు.



బీడీ కాలనీలో కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఏలూరు ఎమ్మెల్యే ఆళ్ల నాని

పోలిశెట్టి, పూలే త్యాగాలు చిరస్మరణీయం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఎస్ఆర్ పోలిశెట్టి, సావిత్రిబాయి పూలే స్ఫూర్తితో ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకుందామని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎస్.వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. పోలిశెట్టి వర్ధంతి, సావిత్రిబాయి పూలే జయంతి సభ ఆదివారం స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు ఆర్.రవికుమార్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ విద్యారంగ వికాసం కోసం ఉపాధ్యాయుల సంక్షేమం కోసం ఉద్యోగం కంటే ఉద్యమం బాటే ముఖ్యమని నమ్మి తన జీవితాన్ని త్యాగం చేసిన ఎస్ఆర్ పోలిశెట్టి ఆదర్శనీయులని కొనియాడారు. సమాజంలో సగభాగంగా ఉన్న మహిళలు చదువుకోవటం ద్వారా సమాజం అభివృద్ధి చెందుతుందని భావించి మహిళలు చదువు కోసం కృషి చేసిన సావిత్రిబాయి పూలేని అందరూ స్మరించుకోవాలని కోరారు. విద్య ప్రైవేటీకరణ అయితే బాలికలే చదువుకు దూరం అవుతారని ఆవేదన వ్యక్తం చేశారు. పోలిశెట్టి, సావిత్రిబాయి పూలేని స్ఫూర్తిగా తీసుకుని ప్రజలందరికీ విద్యా సమాన అవకాశాలు కల్పించడానికి కృషి చేయాలని కోరారు. యూటీఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షులు ఎంవీ శ్యాంబాబు, సహాధ్యక్షులు జీ.వెంకటేశ్వరరావు, బీ.సుభాషిణి, కోశాధికారి ఎస్‌కే ముస్తఫా అలీ, కార్యదర్శులు బి.అనురాధ, పీవీ సాగర్‌బాబు, ఎ.రాజు, ఎంవీ అప్పారావు, జి.రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.వెంకటేశ్వర్లు

ప్రజా సమస్యలను పట్టించుకోని కేంద్రం

ఏలూరు (టూటౌన్): కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక, రైతాంగ వ్యతిరేక విధానాలపై సీపీఐ కార్యకర్తలు సమర శీల పోరాటాలు చేయాలని పార్టీ రాష్ట్ర సమితి సభ్యులు బండి వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. స్థానిక 36వ డివిజన్ శాఖ సమావేశం భగత్‌సింగ్ స్మారక గ్రంథాలయంలో యర్రా వెంకటేశ్వర్లు అధ్యక్షతన ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా బండి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ప్రజా సమస్యల్ని పట్టించుకోవడం లేదని విమర్శించారు. మోదీ సర్కారు గత ఎనిమిదేళ్లుగా ఇచ్చిన హామీలు అమలు చేయకుండా కార్పొరేట్ శక్తులకు మేలు చేసే విధానాలు అవలంభిస్తోందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ శక్తులకు అప్పనంగా దోచిపెడుతున్నారన్నారు. సీపీఐ శాఖ కార్యదర్శి కడుపు కన్నయ్య, కార్యకర్తలు బట్టా మాణిక్యాలరావు, బి.కనకదుర్గారావు, కె.జగన్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బండి వెంకటేశ్వరరావు

చంద్రబాబు, పవన్ భేటీల వల్ల ప్రజలకు ఒరిగిందేమీ లేదు



డీవీ రామాంజనేయులు

ఏలూరు (టూటౌన్): చంద్రబాబు, పవన్ కల్యాణ్ తరచూ భేటీలు, పరామర్శలు చేసుకోవడం వల్ల రాష్ట్ర ప్రజలకు ఒరిగేది ఏమీ లేదని ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ రీజనల్ కో-ఆర్డినేటర్ డీవీ రామాంజనేయులు ఆదివారం ఒక ప్రకటనలో విమర్శించారు. వీరి కలయిక ఆశ్చర్యకరమైన పరిణామం కాదని, ముందునుంచీ ఊహించిందేనని, గతంలో లోపాయికారిగా కొనసాగుతూ నేడు బహిరంగంగా కలుసుకున్నారన్నారు. అసత్య ఆరోపణలతో రాష్ట్ర ప్రభుత్వంపై విమర్శలు గుప్పిస్తున్నారని ఎద్దేవా చేశారు. ప్రజాస్వామ్యం పరిరక్షణ కోసమే తాము కలిసి పోరాటం చేస్తామని ప్రకటించడంలో అర్థం లేదని, ప్రజలను తప్పుదోవ పట్టించి రాజకీయంగా లబ్ధి పొందాలని కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నారన్నారు. చంద్రబాబు పర్యటనల్లో వరుసగా కందుకూరు, గుంటూరు సభల్లో 11 మంది సామాన్య ప్రజలు మృతి చెందితే పోలీసులు కుట్ర చేశారంటూ బుద్ధి లేని ఆరోపణలు చేయడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. చంద్రబాబు సభల్లో ప్రజలు మృతి చెందిన నేపథ్యంలో రోడ్లపై బహిరంగ సభలు, ర్యాలీలు, రోడ్ షోలు నిషేధిస్తూ ప్రభుత్వం జీఓ తీసుకొచ్చిందన్నారు. అయితే విపక్షాలను దెబ్బ తీయడానికే ఈ జీఓ తీసుకువచ్చిందని అసత్య ప్రచారం చేయడాన్ని వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ తరుపున ఖండిస్తున్నట్లు రామాంజనేయులు తెలిపారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	16	అరటి కాయ (1)	05-07
వంకాయలు (గులాబీ)	46	చిక్కుడు కాయలు	44
వంకాయలు (కాంతులు)	52	చామదుంపలు	68
వంకాయలు (తెలుపు)	24	ములక్కాడలు	10-12
బెండకాయలు	54	కంద	32
పచ్చిమిర్చి	32	బీట్‌రూట్	36
కాకర కాయలు	34-38	కీరా దోస	50
బీరకాయలు	32	ఫ్రెంచ్‌బీన్స్	56
బీరకాయలు (పందిరి)	44	అల్లం	60
క్యాబేజీ	16	కొత్తిమీర (కట్ట)	15
క్యారెట్	26	పాలకూర	10
దొండకాయలు	44	చుక్కకూర	10
బంగాళదుంపలు	26	తోటకూర	10
ఉల్లిపాయలు	26	గోంగూర	06
గోరుచిక్కుడు	44	పుదీనా	05
దోసకాయలు	40	బఠాణి	56
అనపకాయ (1)	20-25	క్యాప్సికమ్	60
పొట్లకాయ(1)	20	చిలకడదుంప	24-36

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	32
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం (ఇంద్ర)	21.00	35
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	32
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	35

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.45	4820	27
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	31
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	30
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	25
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	18
ఏలూరు - బీహెచ్‌ఈఎల్	22.15	34820	30
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	09.00	4794	30
ఏలూరు -తిరుపతి	16.00	4830	34
ఏలూరు - విశాఖపట్నం	12.00	4840	34
ఏలూరు -విశాఖపట్నం	22.00	4838	33

క్యాలెండర్ ఆవిష్కరణ

ఏలూరు (టూటౌన్): ఏపీ ఎన్జీఓ సంఘం జిల్లా క్యాలెండర్‌ను ఏపీ హియరింగ్ హ్యాండీకాప్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక సంఘ కార్యాలయంలో ఆవిష్కరించారు. సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షురాలు డి.లావణ్య ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర బధిర ఉద్యోగుల సంఘం అధ్యక్షులు డి.సతీష్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సత్తి శ్రీనివాసరెడ్డి, ఇ.కిరణ్ కుమార్, ఆర్గనైజింగ్ కార్యదర్శి ఎస్.రాము, జాయింట్ సెక్రెటరీ జీడీవీ అయ్యప్పస్వామి, కోశాధికారి జి.రామచంద్రరావు, మహిళా కార్యదర్శి వై.సత్యవతి పాల్గొన్నారు.

కళారూపాలతో సమాజ చైతన్యం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): కళాకారుడు మానవ హృదయ నిర్మాత అని జిల్లా రిజిస్ట్రార్ లంకా వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం స్థానికంగా నిర్వహించిన కార్యక్రమంలో ప్రజానాట్యమండలి రాష్ట్ర క్యాలెండర్‌ను లంకా వెంకటేశ్వర్లు, జిల్లా క్యాలెండర్‌ను లేళ్ల వెంకటేశ్వరరావు ఆవిష్కరించారు. లంకా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రజా కళారూపాలకు సమాజాన్ని చైతన్య పరిచేశక్తి ఉందన్నారు. ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి పీ.మంగరాజు, ప్రజానాట్యమండలి గౌరవ అధ్యక్షులు ఎల్.వేంకటేశ్వరరావు మాట్లాడుతూ ఒక్క సిరా చుక్క లక్షలాది మెదడులను కదిలిస్తోందని అన్న రచయిత కాళోజీ మాటలను ప్రజానాట్యమండలి నిజం చేసిందన్నారు. ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షులు తెల్లం వంశీ, ఉపాధ్యక్షులు నాగాస్త్ర, జిల్లా కోశాధికారి ముస్తఫా అలీ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ, రైతు సంఘం జిల్లా కార్యదర్శి కే. శ్రీనివాస్, పి.కిరణ్, ఐలు నాయకులు ఎస్ఎన్ కట్టా పాల్గొన్నారు.

వైభవంగా శ్రీవైష్ణవ ఆత్మీయ సమారోహం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): హేలాపురి శ్రీవైష్ణవ సేవా సంఘం ఆధ్వర్యంలో స్థానిక రామచంద్రరావుపేట శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానం ఎదురుగా ఉన్న కాలక్షేప మండపంలో ఆదివారం ధనుర్మాస శ్రీవైష్ణవ ఆత్మీయ సమారోహ కార్యక్రమం వైభవంగా జరిగింది. ఉదయం శ్రీ విష్ణు సహస్రనామ పారాయణ అనంతరం శ్రీవైష్ణవ మహిళల ఆధ్వర్యంలో గోదా నాచ్చియార్‌కు సామూహిక కుంకుమ పూజలు చేశారు. అనంతరం బాలభోగ వినియోగం, హైదరాబాద్‌కు చెందిన వంగిపురపు జగన్నాథాచార్య స్వామి శ్రీవిష్ణు పురాణ ప్రవచనం చేశారు. పాంచరాత్ర ఆగమ పరీక్షల్లో జాతీయ స్థాయిలో ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులై బంగారు పతకం సాధించిన నగరానికి చెందిన కిళాంబి వెంకట పవన్ కృష్ణమాచార్యులను, కూచిపూడి నృత్య కళాకారిణి కిళాంబి పూర్ణశ్రీని సన్మానించారు. మధ్యాహ్నం నిర్వహించిన కార్యక్రమంలో బీకే సిస్టర్స్ అన్నమాచార్య కీర్తనలు శ్రావ్యంగా ఆలపించి వీనుల విందు చేశారు. ఈ సందర్భంగా వంగిపురపు జగన్నాథాచార్య స్వామిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో శ్రీవైష్ణవ సంఘం ప్రతినిధులు కొంపల్లి కృష్ణమాచార్యులు, వేదాంతం అచ్యుత కృష్ణ, కిళాంబి వెంకట శేషావతారం, డింగిరి శ్రీనివాస నరసింహాచార్యులు, కె.అనూరాధ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సుదర్శన హోమం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఆర్ఆర్‌పేటలోని శ్రీవేంకటేశ్వర స్వామి దేవస్థానంలో జరుగుతున్న స్వామివారి త్రిసప్తాహ బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం ఆలయంలో శ్రీసుదర్శన హోమం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం స్వామివారికి సుప్రభాత సేవ, నిత్యార్చన, విశేష పూజలు జరిపారు. అనంతరం విష్ణు సహస్రనామ పారాయణ చేసి స్వామి వారి నిత్య హోమాలు, నిత్య కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించి స్వామి వారికి ప్రత్యేక అలంకరణ చేశారు. సాయంత్రం ఆలయంలో నిర్వహించిన పలు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను విశేషంగా అలరించాయి. సాయంత్రం నగరానికి చెందిన వైణిక విశారద ఏ.జయలక్ష్మి శిష్యబృందం నిర్వహించిన శాస్త్రీయ సంగీత విభావరి విశేషంగా ఆకట్టుకుంది. వీరికి వీరా శివప్రసాద్ (వయోలిన్), చల్లపల్లి లక్ష్మీనారాయణస్ (మృదంగం) వాద్య సహకారం అందించారు. రాత్రి విజయవాడకు చెందిన భారతి రాఘవ నృత్య కేంద్రం ఆధ్వర్యంలో అపర్ణా ప్రసాద్ శిష్య బృందం ప్రదర్శించిన కూచిపూడి నృత్యాలు ఆకట్టుకున్నాయి. ట్రస్ట్‌బోర్డు చైర్మన్ తోలేటి శ్రీనివాస్, కార్యనిర్వహణాధికారి ఆంధ్ర రవిశంకర్ కార్యక్రమాలు పర్యవేక్షించారు.

ఐఏఎస్ అధికారులను ఐటీడీఏ పీఓగా నియమించాలి

ఏలూరు (టూటౌన్): ఐటీడీఏ పీఓగా ఐఏఎస్ అధికారులను నియమించాలని సీపీఎం ఏలూరు జిల్లా కార్యదర్శి ఎ.రవి కోరారు. పవరుపేటలోని కార్యాలయంలో తెల్లం రామకృష్ణ అధ్యక్షతన ఆదివారం జరిగిన కార్యవర్గ సభ్యుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఐటీడీఏకు రెగ్యులర్ పీవో లేకపోవడం వల్ల గిరిజనులు తమ గోడును ఎవరికి చెప్పుకోవాలో తెలియని పరిస్థితిలో ఉన్నారన్నారు. గిరిజన దర్బారుకు అధికారులు అందుబాటులో లేకపోవడంతో గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు.